ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 20 | సంచిక : 1 | సెప్టెంబర్ 2014

రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 12

గౌరవ సంపాదకులు

శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రు॥ 150/-

విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు – 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు – 534 265

☎ 08814 - 224747

9247104551

ఈ సంచికలో....

జిన్నూరు

18-08-2014

ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 18-08-2014, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

**హరే రామ హరే రామ రామ రామ హరే హరే**

**హరే కృష్ణ హరే కృష్ణ కృష్ణ కృష్ణ హరే హరే**

ఇందులో 16 అక్షరాలు ఉన్నాయి. ఈ 16 అక్షరాలు కలియుగానికి మహామంత్రం అని బ్రహ్మదేవుడు నారదుడికి బోధించాడు. మనకి దశావతారాలు ఉన్నాయి. అందులో రామావతారం, కృష్ణావతారం ముఖ్యమైన అవతారాలు. కృష్ణం వందే జగద్గురుమ్ అంటే జగత్తుకు గురువు అయిన కృష్ణపరమాత్మకు నమస్కారం. మన భారతదేశానికి గురువు అని, హిందువులకు గురువు అని చెప్పలేదు, ఆయన జగత్తుకు గురువు. ఒక్క ఆత్మ విద్యేకాదు ఆయనకు తెలియని విషయం ఏమీ లేదు. ఆయన సర్వజ్ఞుడు. రామస్వామి నవమి రోజున, కృష్ణస్వామి అష్టమి రోజున జన్మించారు. రాముడికి, కృష్ణుడికి తేడా ఏమిటి అంటే రాముడు మహారాజు ఆయన మనలను ఎంతగా ప్రేమించినా ఆయనతో మనం సన్నిహితంగా తిరగలేము ఎందుచేతనంటే ఆయన మహారాజు కాబట్టి. కృష్ణుడివి సోషలిస్టు భావాలు. ఆయనకు అందరూ స్నేహితులే. గొర్రెలు కాచుకునేవారు, గోపికలు మొత్తం అందరూ ఆయనకు సహచరులే, అందరితో కలిసి తిరిగేవాడు.

కృష్ణావతారాన్ని పూర్ణావతారం అంటారు. అంటే భగవంతుడి దగ్గర ఎన్ని కళలు ఉన్నాయో, ఎన్ని శక్తులు ఉన్నాయో అన్ని కళలతోటి,

అన్ని శక్తులతోటి ఈ భూమి మీద శరీరం ధరించినవాడే కృష్ణస్వామి. కృష్ణ జన్మస్థానం అయిన మధురలో జైలు దగ్గర చూస్తే అక్కడ కృష్ణుడు పుట్టాడు అని వ్రాయలేదు, పుట్టినవానివలె కనిపించాడు అని వ్రాసారు. పరమాత్మకు పుట్టుక ఏమిటి? జనన మరణములతో ఆయనకు సంబంధంలేదు. కృష్ణుడియొక్క క్షేత్రాలలో బృందావనం, రేపల్లె, మధుర, ద్వారక ముఖ్యమైనవి. ద్వారకలో ఆచార్యులవారు పీఠంకూడా స్థాపించారు. కృష్ణుడు శరీరాన్ని తీసుకున్నది మధురలో, శరీరాన్ని విడిచిపెట్టింది గుజరాత్‌లో అంటే ఇక్కడ శరీరాన్ని తీసుకొన్నవాడివలె, అక్కడ శరీరాన్ని విడిచిపెట్టినవాడివలె మనకు కనిపించాడు. ఆయన శరీరంలో ఉన్నా శరీరం లేనివాడే అంటే ఆ శరీరానికి ఆయనకు ఏమీ సంబంధంలేదు. ఆంధ్రదేశంలో రాముడిని, గుజరాత్‌లో కృష్ణుడిని ఎక్కువగా ఆరాధిస్తారు.

నాలుగు రోజులకిందట నా అనుభవంలో జరిగిన సంఘటన చెపుతున్నాను. నేను కృష్ణభక్తుడిని కాకపోయినా పరమాత్మ నాకు ఒక మహిమ చేసి చూపించాడు. ఎవరో భక్తులు నాకు పూరీజగన్నాధుడు బొమ్మ ఇచ్చారు. ఆ బొమ్మకు కాళ్ళు చేతులు ఉండవు, పెద్ద మొఖం ఉంటుంది, పెద్దపెద్ద కళ్ళు ఉన్నాయి. నేను ఆ బొమ్మవంక అలా చూస్తున్నాను. అలా చూస్తూ ఉంటే నా శరీరం సడెన్‌గా అదృశ్యం అయ్యింది. అంటే చూసేవారికి నా శరీరం ఇక్కడ ఉన్నట్లు అనిపించిన నాకు సడన్‌గా అదృశ్యమయ్యింది. ఆ టైములో నాకు ఎలా తోచింది అంటే ఉన్నది ఒక్కటే, అదే చైతన్యం, అది తప్పించి సర్వం శూన్యం అనిపించింది. అక్కడకూడా నేను ఉన్నాను అన్న సంగతి నాకు తెలుస్తోంది, మిగతాదంతా శూన్యంగా ఉంది. మూడు శరీరాలు అంటే స్థూల, సూక్ష్మ, కారణశరీరాలు శూన్యం, మూడు కాలాలు భూతకాలం, వర్తమానకాలం, భవిష్యత్‌కాలం అన్నీ నూటికి నూరుపాళ్ళు అసత్యం కింద కనిపించాయి. పూర్వం మనం ధరించిన దేహాలు, ఈ దేహం, రాబోయే దేహాలు అన్నీ మాయ దేహాలే. ఈ శరీరం నాది అని ఇప్పుడు ఎంత గట్టిగా అనుకొంటున్నానో అంత గట్టిగా ఇది మాయే అనేటువంటి అనుభవాన్ని జగన్నాధుడు నాకు ప్రసాదించాడు. నేను ఆయన భక్తుడిని కాకపోయినా పరమాత్మ నాకు అనుభవాన్ని ప్రసాదించాడు. మీరు నా మాటలను కాదనవచ్చుకాని నా అనుభవాన్ని ఎలా కాదంటారు. హిందూమతానికి, బౌద్ధమతానికి ఒక తేడా ఉంది. బౌద్ధమతంలో పూజలగురించి, జపాలగురించి చాలా

తక్కువగా చెప్పాడు, నైతిక విలువల గురించి ఎక్కువగా చెప్పాడు. మీ మనస్సులు బాగుపడాలంటే మీమాట సౌమ్యంగా ఉండాలి, ప్రవర్తన సౌమ్యంగా ఉండాలి, చేత సౌమ్యంగా ఉండాలి. మీరు ఏదైనా మంచిపని చేస్తే మంచికోసం ఆ పని చేయాలి కాని ప్రదర్శన కోసం చేయకూడదు. మీరు ఏదైనా సంపాదిస్తే మీ పొట్ట, బట్ట చూసుకొంటూ మిగతాది ఎంతోకొంత సమాజానికి ఉపయోగించాలి. ఇలా మీ ప్రవర్తనను సరిచేసుకొంటూ మీ మనస్సును బాగుచేసుకుంటే మీరు మహర్షులు, యోగులు అవుతారు. కాని మీ ప్రవర్తనను సరిచేసుకోకుండా, మీకు రైట్ బిహేవియర్ లేకుండా ఏదో బాహ్యప్రక్రియల వలన, పూజలు చేయటం వలన మీరు శాంతిని పొందలేరు. వాటివలన మీకు పుణ్యం రావచ్చుకాని ఆత్మానుభవం రాదు. హిందూమతానికి, క్రైస్తవమతానికి దేవుడు కేంద్రం కాని బౌద్ధమతంలో శీలాన్ని కేంద్రంగా పెట్టుకొని బుద్ధుడు సబ్జక్టు అంతా చెప్పాడు. నీ కేరెక్టర్ సరిచేసుకుంటే దాని వలన నీకు జ్ఞానం కలుగుతుంది కాని ఏదో రామేశ్వరం వెళ్ళాము, కాశీ వెళ్ళాము యాత్రలు చేసివచ్చాము అంటే దాని వలన ఏమీ లాభంలేదు. మీ మనస్సును పరిశుద్ధం చేసుకోండి, మీ హృదయాన్ని పరిశుద్ధం చేసుకోండి. పరిశుద్ధమైన హృదయం గలవారు ధన్యులు, వారు దేవుని చూచెదరు.

"దేవుడు ఉన్నాడా? లేడా?" అని రమణమహర్షిని అడిగితే "నువ్వు ఉన్నావా?" అని అడిగేవారు. "నువ్వు ఉంటే దేవుడు ఉన్నాడు, నువ్వు లేకపోతే ఆయనా లేడు" అని చెప్పారు. బుద్ధుడు అది కూడా చెప్పలేదు. దేవుడు ఉన్నాడనికాని, దేవుడు లేడు అని కాని ఆయన ఎక్కడా చెప్పలేదు. భగవంతుడి పేరు మీద ఏవో యాత్రలు చేస్తే, ఏవో నదులలో మునిగితే మీరు పవిత్రులు అయిపోతారా? మీరు ఎక్కడైనా నదిలో స్నానంచేస్తే మీ శరీరం మీద ఉన్న మట్టిపోతుంది కాని మీ మనస్సులో ఉన్న బురదపోతుందా? మతంపేరు మీద, దేవుడి పేరు మీద జంతువులను చంపటం, యజ్ఞాలు యాగాలు చేయటం ఇవి అన్నీ పెరిగిపోయాయి కాని మన కేరెక్టర్‌ను అభివృద్ధి చేసుకొందాము, మానవజాతికి ఎంతోకొంత ఉపయోగ పడదాము అనేటువంటి భావన పోతోంది. కనిపిస్తున్న మనిషి మీద నీకు ప్రేమ లేనప్పుడు కనిపించని దేవుడి మీద నాకు ప్రేమ ఉంది అంటే ఎలా నమ్ముతారు. అందుచేత శీలాన్ని కేంద్రంగా పెట్టుకొని బుద్ధుడు బోధించాడు, నైతిక విలువల గురించి ఎక్కువగా చెప్పాడు.

మీ అందరి హృదయాలలో అంతర్యామిగా ఉన్నవాడిని, ఆత్మగా ఉన్నవాడిని నేనే అని కృష్ణపరమాత్మ చెప్పాడు. మిగతావాళ్ళు అందరూ రకరకాలుగా చెప్పారుకాని అందరి హృదయాలలో అంతర్యామిగా ఉన్న వాడిని నేనే అని ఆయన ఒక్కడే చెప్పాడు. మీ శరీరంకంటే, మీ ఇంద్రియాలకంటే, మీ మనస్సు కంటే అతిసన్నిహితంగా మీ హృదయంలో ఉన్న నన్ను మీరు అందుకోలేకపోతున్నారు. మీకు అంతర్దృష్టి కలగటంలేదు, నా మీద మీకు విశ్వాసం కలగటంలేదు. మీకు విశ్వాసం కలగాలంటే సద్బుద్ధి ఉండాలి, సహృదయం ఉండాలి. పూర్వపుణ్యం ఉండాలి. నా మీద మీకు ఉన్న ప్రేమనుబట్టి, ఆప్యాయతనుబట్టి మీరు నన్ను పొందగలరుగాని ఏవో మీకు ఉన్న తెలివితేటలను బట్టి నన్ను పట్టుకోవటం మీకు సాధ్యంకాదు.

కృష్ణుడు వెన్నదొంగ అంటే ఏదో వెన్నపూస దొంగతనంచేసి తినేస్తాడు అనికాదు "వెన్నపూస ఎంత మృదువుగా ఉంటుందో అలాగ మీ మనస్సు కూడా మృదువుగా అయితే మీ మనస్సును ఆయన స్వీకరిస్తాడు, ఆయన స్వరూపాన్ని మీకు ఇస్తాడు. ఎందుకుపనికిరాని మీ మనస్సును ఆయన తీసుకొని ఆయన స్వరూపాన్ని మీకు ఇస్తాడు" వెన్నపూస దొంగ అంటే అది. కృష్ణుడు గోపికలతో ఆడుకొన్నాడు అని కొంతమంది సహృదయంలేనివారు ఆక్షేపిస్తారు. పరమాత్మ గోపికలతో ఆడుకోవడం ఏమిటి? మీ మనస్సులో ఉన్న కొన్ని బలహీనతల నుండి మిమ్మల్ని బయటకు తీసుకొని రావటానికి వ్యాసుడు ఆ కథలను వ్రాసాడు. ఇంద్రియభోగాలు తాత్కాలికంగా బాగున్నప్పటికీ తరువాత వాటివలన వచ్చే దుఃఖం ఎలా ఉంటుందో అక్కడ చూపించాడు. కృష్ణుడు దూరమైనప్పుడు గోపికలు ఆయనకోసం ఎలా విలపించారో ఇంద్రియలోలులకు వచ్చే దుఃఖం ఎలా ఉంటుందో అంతా భాగవతంలో చూపించాడు. బాహ్యంగా కృష్ణుడితో వారికి ఉన్న అనుబంధం తెగిపోయినప్పుడు వారికి వచ్చే విరహబాధ అది అంతా అక్కడ చూపించాడు. గోపికలకు, కృష్ణుడికి ఉన్న అనుబంధాన్ని కొంతమంది తప్పగా అర్థంచేసుకొంటారు. మనకోసమే ఈ కథ అంతా చెపుతున్నాడు అని మనకు తెలియక, దానిని అర్థం చేసుకొనేలోతులు మనకు లేకపోవటంవలన అది మనకు అందటంలేదు. కృష్ణుడు అంటే ఆ శరీరమే, ఆయన ఇంద్రియాలతో ఉన్నట్లు మనకు కనిపిస్తోంది. కాని ఆయన ఇంద్రియాలు లేనివాడు, మనస్సులేనివాడు, శరీరం లేనివాడు, మన కోసమే ఆయన శరీరం ధరించాడు అనే గ్రహింపు మనకు రావటంలేదు. ఎక్కడైతే

ధర్మం తగ్గిందో అక్కడ నన్ను నేను సృజించుకొంటాను అని పరమాత్మ చెప్పాడు కాని అందరిలాగే నేను పుడతాను అని చెప్పలేదు. బుద్ధుడు ఏమని చెప్పాడు అంటే మీరు సంపాదించుకోండి, అందులో పొరపాటులేదు. మీ సంపాదన మటుకు దుర్వినియోగం అవ్వకూడదు. మీ సంపాదన సద్వినియోగం అయ్యేలాగ ఖర్చు పెట్టండి. అది కూడా యజ్ఞమే. అంటే మీ పొట్టకు సరిపడ ఖర్చుపెట్టుకొంటూ మిగిలిన సంపాదన మీరు సమాజానికి ఉపయోగించాలి అని బుద్ధుడు చెప్పాడు.

శ్రీకృష్ణచైతన్యుడు పూరీలో 12 సంవత్సరాలు ఉన్నాడు. శ్రీకృష్ణచైతన్యుడు గురించి వివేకానందస్వామి ఏమని చెప్పాడు అంటే ఆయన దేహం ఉన్నవాడివలె మనకు కనిపించాడు కాని నూటికి నూరుపాళ్ళు దేహంలేనివాడు అని చెప్పాడు. వివేకానందుడు చైతన్యస్వామి గురించి చెప్పిన ఆ మాటలు చదివి నేను నమ్మలేకపోయాను. అసలు ఆయనకు శరీరమే లేదు అని స్వామీజీ అన్నప్పుడు ఆ వాక్యం అర్థం చేసుకోవటం నాకు చాలా కష్టం అయ్యింది. విష్ణుసహస్రనామాలు అన్నీ కూడా పరమాత్మ పేర్లే. అందులో ముఖ్యమైన నామం గోవిందా. గోవింద, గోవింద అని ఆయన నామం స్మరించుకొంటూ మొదటి ముద్ద తినమన్నారు. కాటన్‌దొర ఆనకట్ట కట్టకముందు గోదావరి జిల్లాలలో ఒకసారి విపరీతమైన కరువు వచ్చింది. మెత్తనిమట్టి ఎక్కడ దొరుకుతుందో చూసుకొని ఆ మట్టిని తిన్నారు. కాటన్‌దొర మనకు ఆనకట్ట కట్టాడు కాబట్టి ఆయన పేరును తలుచుకుంటూ మనం అన్నం తినాలి. మనకు తిండి పెట్టినవారిపట్ల మనకు కృతజ్ఞత లేదు. అది కలియుగ దోషం అవ్వవచ్చు. ఈ మధ్య నేను కేర్ హాస్పిటల్‌లో రెండు రోజులు ఉన్నాను. నా ప్రక్క గదిలో ఉన్న ఒక ముసలాయనకు ఆయన మనవరాలు అన్నం తీసుకొనివచ్చి పెడుతోంది. ఆ తాతగారు ఏమంటున్నారు అంటే "నేను హాస్పిటల్‌లో ఉండి మిమ్మల్ని ఇబ్బంది పెడుతున్నాను. మీరు నాకు టైముకు భోజనం తెస్తున్నారు. మిమ్మల్ని అందర్నీ ఇబ్బందిపెట్టటానికే ఈ హాస్పిటల్‌లో జాయిన్ అయ్యానేమో" అంటున్నారు. అప్పుడు ఆ మనవరాలు ఏమంటోంది అంటే "తాతయ్యా! మేము అన్నం తెచ్చినందుకు ఇటువంటి మాటలు మీరు మాట్లాడుతున్నారు. చిన్నప్పటినుండి మీరు మమ్మల్ని శ్రద్ధగా పెంచకుండా, మీరు మాకు అన్నం పెట్టకుండా, మాకోసం డబ్బు ఖర్చుపెట్టకుండా, మాకోసం జాగ్రత్తలు తీసుకోకుండా వూరికే మేము పెద్దవాళ్ళము అయిపోయి ఈ రోజున

ఉద్యోగాలు చేస్తున్నామా? మేము అన్నం తెచ్చినందుకే మీరు ఇలా అంటూ ఉంటే మీరు ఇంతకాలం మమ్మల్ని పెంచినందుకు మేము ఏమనుకోవాలి? అందుచేత ఇటువంటి మాటలు అనకండి, ఈ మాటలు మీరు అనవలసిన పనిలేదు" అని చెప్పింది. ఆ మనవరాలు చెప్పిన మాటలు నాకు భగవద్గీతలో మాటలా ఉంది.

యుద్ధ సమయంలో తలకాయలు ఉంటాయో, ఉండవో అనే భయానక పరిస్థితులలో భగవద్గీత చెప్పటం సాధ్యమా? అది నమ్మదగినదా? అని అంటారు. ఆ ప్రశ్న న్యాయమైనదే. మీ ప్రశ్నలోనే భగవంతుడు ఉన్నాడు. టెన్షన్‌లో ఉన్నప్పుడు ఎవడూ టీచ్ చెయ్యలేడు. ఆయన భగవంతుడు కాబట్టి చెప్పగలిగాడు. భగవంతుడికి టెన్షన్ ఏమిటి? ఆయన నోమైండ్ స్టేట్‌కు వెళ్ళాడు. నోమైండ్ స్టేట్‌కు వెళ్ళినవాడికి టెన్షన్ ఏముంటుంది? మనస్సు ఉంటే గొడవ అంతా, మనస్సే లేనప్పుడు ఏ గొడవ లేదు. ఇదే బుద్ధుడి చరిత్రలో వస్తుంది కదా! అంగుళీమాళుడు బుద్ధుడితో ఆగు, ఆగు అంటాడు. అంగుళీమాళా నేను ఎప్పుడో ఆగిపోయాను. ఆగవలసింది నేను కాదు, ఇప్పుడు ఆగవలసింది నువ్వు. అంటే బుద్ధుడు అప్పటికే అమనస్కస్థితిని పొంది ఉన్నాడు. నన్ను చంపటానికి వస్తున్నావు ఇప్పుడు ఆగవలసింది నేను కాదు. నేను ఎప్పుడో ఆగిపోయాను. ఆగవలసింది నువ్వు. అమనస్కస్థితిని పొందవలసింది నువ్వు. అంగుళీమాళుడు దగ్గరకు వచ్చాడు. కత్తి చేతిలో ఉంది కాని పైకి లేవటంలేదు. బుద్ధుడిని చంపాలనే బుద్ధి సడన్‌గా వాడిలో పోయింది. నన్ను చంపవద్దని బుద్ధుడు చెప్పటంలేదు. బుద్ధుడి ప్రెజెన్స్‌లో వెంటనే వాడు నార్మల్‌స్థితిని పొందాడు. మహాత్ములతోటి, మహర్షులతోటి స్నేహం చేయమని ఎందుకు చెపుతారు అంటే వారి సమక్షంలో ఉన్నప్పుడు మన మనస్సులో సడన్‌గా మార్పు వస్తుంది. మల్లెపూవుల దగ్గర కూర్చుంటే మల్లెపూవుల వాసన ఎలా వస్తుందో అలాగ మహాత్ముల సమక్షంలో జ్ఞానతరంగాలు, కాంతితరంగాలు వచ్చి మన బ్రెయిన్‌ను ముంచేస్తాయి. మనకు మారుమనస్సు వస్తుంది అందుచేత హోలీకంపెనీ అవసరమని పెద్దలు చెపుతారు.

ఈ లోకంలో అశాంతిని తీసుకొని వచ్చేవారు చాలామంది ఉన్నారు. వారిని సంహరించాలి అంటే యుద్ధంపేరు చెప్పి అందరినీ ఒకేచోటుకు తీసుకొనివచ్చి కృష్ణుడు వారిని సంహరించాడు. అయితే కృష్ణుడికి పాపంరాదా అని మీరు అనుకోవచ్చు. అక్కడ

కర్తృత్వం లేదు. కర్తృత్వం లేకుండా కృష్ణుడేకాదు మీరు కూడా ఏ పని చేసినా మీకు పాపంలేదు. కర్తృత్వం లేకుండా మీరు ఏ పనిచేసినా అది మిమ్మల్ని బంధించదు. యుద్ధ సమయంలో అర్జునుడికి వచ్చిన విషాదాన్ని పట్టుకొని ఇప్పడు చెపితే వాడి బుర్రకు బాగా అర్థమవుతుంది అని సడన్‌గా అక్కడ టీచింగ్ మొదలుపెట్టాడు. అర్జునుడికి బోధించడానికి కృష్ణుడికి అక్కడ టైము దొరికింది. అవకాశాలు అందరికీ వస్తాయి. తెలివైనవారు దానిని ఉపయోగించుకొంటారు. తెలివితక్కువవారు దానిని వదిలేస్తారు. బుద్ధుడికి ఎప్పడు వైరాగ్యం వచ్చింది అంటే ఒక శవాన్ని చూసాడు, ఒక రోగిని చూసాడు, కర్ర పట్టుకొని వంగి నడుస్తున్న వాడిని చూసాడు. మనం కూడా ఇలా అయిపోతామా, మన శరీరాలు కూడా శవాలు అయిపోతాయా అని అప్పడు ఆయనకు ఆలోచన ప్రారంభమైంది. జెకెగారు చూస్తూ ఉండగానే ఆయన కళ్లముందే అన్నగారు చనిపోయాడు. ఆయనలాగే మనంకూడా ఇదేరకంగా చనిపోతాము కదా అని అక్కడనుండి ఆయనకు వైరాగ్యం ప్రారంభమయ్యింది. అలాగే అందరి జీవితాలలో కొన్ని టర్నింగ్ పాయింట్స్ వస్తాయి. ఇదే షెక్స్పియర్ చెప్పాడు. దెరీజ్ ఎ వేవ్ దట్ షేప్స్ అవర్ ఎండ్స్. సముద్రంలో కెరటాలు వస్తాయి. కొన్ని లోపలకు తీసుకొనిపోతాయి, కొన్ని ఒడ్డున పడేస్తాయి. అలాగే ప్రతీవాడి జీవితంలోను ఒక కెరటం వస్తుంది. ఆ కెరటం ఎటుగెంటేస్తుందో మనం చెప్పలేము. తులసీదాసు గారి భార్య తులసీదాసుతో ఏమంది అంటే "నామీద నీకు ఉన్న ప్రేమ, నా మీద నీకు ఉన్న అనురాగం రాముడిపట్ల ఉంటే ఈ పాటికి నీకు మోక్షం వచ్చి ఉండేది" అని చెప్పింది. ఆ మాట ఆయనలో మార్పు తీసుకొనివచ్చింది. అశోకుడికి, కళింగులకు యుద్ధం జరిగింది. కళింగయుద్ధంలో కాలువలో నీరు ఎలా ప్రవహిస్తుందో అలాగ మనుషుల రక్తం ప్రవహించింది. అది అశోకుడు చూసాడు. ఇంతమందిని చంపేసి ఈ రాజ్యాన్ని ఏమి చేసుకొంటాము. చివరకు వట్టి చేతులతో బయటకు పోవాలి కదా అనుకొన్నాడు. ఆ సంఘటన అశోకుడిలో మార్పు తీసుకొనివచ్చింది, అప్పటినుండి యుద్ధాలు మానేసాడు.

భగవద్గీత యూనివర్సల్ గ్రంథం. ఇది ఎవరో చెప్పిందికాదు, స్వయంగా భగవంతుడే చెప్పాడు. హరేకృష్ణ వాళ్ళు, గౌడీయమఠం వారు ఎక్కువగా కృష్ణుడిని ఆరాధిస్తారు. శివుడిని ఆరాధించినా మరి మాకు కూడా కోరికలు నెరవేరుతున్నాయి కదా అని మనం అంటే "శివుడిలో అంతర్యామిగా ఉన్న వాడు కృష్ణుడే. శివుడి ద్వారా కోరికలు నెరవేరినట్లు మీకు

అనిపిస్తుంది. శివుడు దేవుడు కాదని మేము అనటంలేదు, వాడిలో కూడా అంతర్యామిగా ఉన్నవాడు నారాయణుడే" అది వారి వాదం. మీరు నమ్మినా, నమ్మకపోయినా ఒకమాట నేను చెపుతున్నాను. కృష్ణుడు చెప్పినట్లుగా అమెరికా వాళ్ళు నడుచుకొంటున్నారు, అందుచేత వారు ధనవంతులు అయ్యారు. మనం అలా నడుచుకోవటంలేదు అందుచేత ఇలా ఉన్నాము. అమెరికా వాళ్ళకు పని విభజన లేదు. అమెరికావాళ్ళు కష్టపడి పనిచేస్తున్నారు, పనిని యోగంగా చేస్తున్నారు కాబట్టే పైకి వచ్చారు. భగవద్గీతలో వర్క్‌కల్చర్‌కు చాలా ప్రాముఖ్యిత ఇచ్చాడు. కృష్ణుడు మనవాడే అయినప్పటికీ ఆయన చెప్పినట్లు మనం ఆచరించటంలేదు, మనం సోమరితనానికి అలవాటు పడిపోయాము. నాయందు మనస్సును నిలబెట్టు అని పరమాత్మ చెపుతున్నాడు. అంటే నీకు విషయచింతన వద్దు, ఆత్మచింతన చెయ్యి, నువ్వు ఏదైతే చింతిస్తున్నావో అదే అవుతావు. ఇది మీరు గుర్తుపెట్టుకోండి. మీరు జీవితం పొడుగునా ఏదైతే చింతిస్తున్నారో మరణించే టైములో అదే చింతన వస్తుంది, దానినిబట్టి మీకు పునర్జన్మ ఏర్పడుతుంది. అంటే మీ పునర్జన్మను మీరే తయారుచేసుకొంటున్నారు. దానితో భగవంతుడికి సంబంధంలేదు. మీరు ఇంటిదగ్గర కూర్చున్నప్పుడు లోకం గొడవలు చెప్పకొంటారు. దానివలన లోకానికి దగ్గరవుతారు, భగవంతుడికి దూరమైపోతారు. లోకం గొడవలు చెప్పకోవటం వలన ప్రమాదం ఉందని మీకు తెలియటంలేదు. మీరు పరస్పరం నా గురించి మాట్లాడుకోండి, నన్ను ఎంజాయ్ చెయ్యండి అప్పుడు మీకు విషయచింతన రాదు అంటున్నాడు పరమాత్మ. దైవచింతన ప్రధానం. దైవచింతన చేస్తూ ఉంటే దైవస్వరూపులు అవుతారు.

నాయందే మనస్సును స్థిరంగా ఉంచండి. నీ బుద్ధిని కూడా నాయందే పెట్టు అని పరమాత్మ చెపుతున్నాడు. ఆలోచించేది మనస్సు, నిర్ణయం తీసుకునేది బుద్ధి, పరమాత్మ ఏమన్నాడు అంటే నీ బుద్ధి పాడైపోయాక నీకు ఆస్థి ఉన్నా, డబ్బు ఉన్నా అవి ఎందుకు? ఏమి చేసుకొంటావు? నీ బుద్ధి పాడైపోయాక నువ్వు చేసేది ఏముంది? అందుచేత బుద్ధిని బాగుచేసుకో. విషయచింతన చేస్తూ ఉంటే చివరకు నీ బుద్ధిపాడైపోతుంది. నీ బుద్ధి పాడైపోతే నువ్వు అన్ని రంగాలలో పాడైపోయినట్లే. అందుచేత నీ బుద్ధిని, మనస్సును నాయందే నిలబెట్టు. నేను చెప్పే మాటలయందు సంశయం పెట్టుకోవద్దు. నేను చెప్పే మాటలయందు సందేహం పెట్టుకోకుండా వాటిని హృదయపూర్వకంగా విశ్వసిస్తూ ఉంటే

నాలో ఐక్యమవుతావు. ఇంక నీకు పునర్జన్మలేదు. ఈశ్వరుడు చెప్పిన వాక్యాన్ని నమ్మి దాని మీద స్థిరంగా నిలబడి ఉంటే సృష్టిలో ఎవడికి లేని ఆనందాన్ని, సుఖాన్ని పొందుతావు, అంత ఉన్నతశిఖరానికి వెళ్ళిపోతావు. నీ మనస్సును భగవంతుడి మీద ఏకాగ్రం చెయ్యి. ఏకాగ్రత జీవితంలో చాలా ముఖ్యం. నీ మనస్సును డైరెక్టుగా నా మీద నిలబెట్టలేవు అనుకో ఈశ్వరార్పితంగా కర్మచేసినా ఈశ్వరుడిని పొందుతావు.

ఎవరినీ ద్వేషించకు. మనిషికి తొందరగా ద్వేషం వస్తుంది. ఒక మనిషి ఇంకో మనిషిని విమర్శించటానికి ద్వేషమే కారణం. మన దగ్గర నాలుగు రూపాయలు ఎక్కువగా ఉంటే మనలను చూసి అసూయపడతారు, లేకపోతే బీదవాడు అంటారు. వాడికి తాడు బొంగరం లేదు అంటారు. ఇది మానవ స్వభావం. ఈ లోకం కుక్కతోక వంటిది. కుక్కతోక వంకరను ఎవడూ తీయలేడు, లోకం కూడా అంతే. అసలు అసూయ ఎక్కడనుండో రాదు, మన కుటుంబ సభ్యులనుండే ప్రారంభమవుతుంది. అసూయకు పెట్టుబడి అక్కరలేదు. పరమాత్మ ఏమన్నాడు అంటే "అర్జునా! నీకు నాకు బంధుత్వం ఉంది, స్నేహితులం, కలసి ప్రయాణాలు చేసాము కానీ నీ మొఖంలో ఎప్పడూ అసూయ నాకు కనబడలేదు. అసూయ ఎలా ఉంటుందో నీకు తెలియదు. నువ్వు అనసూయుడవు. ఆ ఒక్క గుణానికే నీకు స్వాధీనమైపోయి నేను భగవద్గీత చెపుతున్నాను. ఆ ఒక్క గుణమే నీయందు నాకు ఆకర్షణ కలుగజేసింది" అని చెప్పాడు. మీరు ఏమి చెయ్యాలి అంటే ఒకవేళ మీకు ధనం ఉన్నా, కీర్తి ఉన్నా, జ్ఞానం ఉన్నా ఎవరికీ తెలియకుండా చూసుకోండి. మీ ప్రవర్తన ఎలా ఉండాలి అంటే ఇతరుల ద్వేషానికి మీరు కారకులు కాకూడదు. ఇది జ్ఞాపకం పెట్టుకోండి. తప్ప అంతా వారి మీద వేయటంకాదు, మీ ప్రవర్తనకూడా వారి ద్వేషానికి కారణం అవ్వకూడదు. మీరు కట్టుకొనే బట్టలవిషయంలో కూడా జాగ్రత్తగా ఉండమని రామకృష్ణుడు చెప్పాడు. "మీరు ఎక్కువ ఖరీదైన చీరలు కట్టండి, ఇంతకుముందు మీకు గర్వం లేకపోయినా మీకు తెలియకుండానే గర్వం వచ్చేస్తుంది" అని చెప్పాడు. అన్నం వారి కోసమే తింటారు, బట్టలు ఇతరులకోసం కట్టుకొంటారు. జీవులపట్ల ద్వేషభావన వద్దు, మైత్రి కలిగి ఉండు. మైత్రి అంటే కర్ణుడికి, ధుర్యోధనుడికి ఉన్న స్నేహం ఉదాహరణగా చెపుతారు. కర్ణుడు ఏమన్నాడు అంటే "ధుర్యోధనుడు దుర్మార్గుడు అవ్వవచ్చు కాని నాకు తిండి లేనప్పడు తిండిపెట్టాడు,

రాజులు ఎవరూ నన్ను గౌరవించనప్పుడు చిన్నరాజ్యం ఇచ్చి పరిపాలన చేసుకోమన్నాడు, సమాజంలో గౌరవం తీసుకొనివచ్చాడు. ఇవాళ వాడితోటి స్నేహం వదులుకోమంటున్నారు ధుర్యోధనుడు చెడ్డవాడు అయి ఉండవచ్చు కానీ ఈ కష్టకాలంలో, ఈ అవసానదశలో వాడిని నేను విడిచిపెట్టను" అన్నాడు కర్ణుడు. అదీ మైత్రి. తన ప్రాణం పోతుందని తెలిసి కూడా కర్ణుడు ధుర్యోధనుడిని విడిచిపెట్టలేదు.

మీ ఇంటి దగ్గర మీ పనులు మామూలుగా చేసుకోండి కాని మమకారం పెట్టుకోవద్దు. మీరు ఇంటి దగ్గర ఎలా బతకాలో దానికి రామకృష్ణుడు చెప్పాడు. మీ ఇంటి దగ్గర పని మనిషి ఉంటుంది. అది మీ ఇల్లు తుడుస్తుంది కాని ఆ ఇల్లు నాది కాదు అని ఆమెకు తెలుసు. మీ పిల్లలను ఎత్తుకొంటుంది, వారికి ఆకలివేస్తే అన్నం పెడుతుంది కాని ఆ పిల్లలు నావాళ్ళు కాదు అని ఆమెకు తెలుసు. మీ ఇంట్లో వస్తువులను జాగ్రత్తగా చూస్తుంది కాని ఆ వస్తువులు నావి కాదని మనస్సులో అనుకొంటుంది. ఆ పనిమనిషి మీ ఇంట్లో ఎలా బతుకుతుందో మీరు కూడా ఇంటి దగ్గర అలా బతకండి అప్పడు మీకు మమకారం తగ్గిపోతుంది, మీరు భగవంతుడిని పొందుతారు. అంటే మీ ఇంట్లోనే మీరు పనిమనుషులకింద ఉండండి. అలా పనిచేయటం వలన పని అయిపోతుంది, మమకారం నెమ్మదిగా పోతుంది. మీ మాటలోగాని, చేతలోగాని, చూపులోగాని ఎక్కడా వ్యక్తిభావన ప్రదర్శించవద్దు. కొంతమంది వాళ్ళు నడుస్తూ ఉంటే వారు ఎంత అహంకారపూరితులో మనకు తెలుస్తుంది. అలాకాదు, పని జరిగిపోతూ ఉండాలి అక్కడ మనిషి కనబడకూడదు.

ఇక్కడ పరమాత్మ ఏమని చెపుతున్నాడు అంటే నీ మనస్సును నాయందు లగ్నం చెయ్యి. ఒకవేళ నీ మనస్సును నాయందు నిలబెట్టలేవు అనుకో, నీ మనస్సులో చాపల్యం ఎక్కువగా ఉంది అనుకో నాకు ఇష్టమైన పని చెయ్యి. నీ అహంకారానికి ఇష్టమైన పని చేయటంకాదు, నేను చేయమని చెప్పిన పనిని చెయ్యి. నీ ఇష్టాయిష్టాలను తీసి ఒక ప్రక్కన పెట్టు. ఈ పని చెయ్యటం భగవంతుడికి ఇష్టమా, కాదా అని ఆలోచించు. భగవంతుడికి ఇష్టమైతే ఆ పనిని చెయ్యి, ఆయనకు ఇష్టంలేదు అనుకో ఆ పనిని చెయ్యటం మానెయ్యి. అప్పడు మనస్సు యొక్క చాపల్యం తగ్గుతుంది. ఈ మధ్య నేను ఒకరిని అడిగాను "మీకు ఏ కూరలు అంటే ఇష్టం, ఏ కూరలు ఎక్కువగా తింటారు" అని అడిగాను. ఆవిడ ఏమన్నారు అంటే "ప్రత్యేకంగా

నా ఇష్టం చూసుకోను, మా అబ్బాయిలకు ఏది ఇష్టమో అదే వండేసి నేను కూడా అదే తింటాను. అది నాకు ఇష్టంలేకపోయినా తినేస్తాను" అన్నారు. అదే ఇక్కడ భగవంతుడు చెపుతున్నాడు. నీకు ఇష్టం లేకపోయినా భగవంతుడు ఏ పని చెయ్యమని చెప్పాడో ఆ పని చెయ్యి అప్పడు నువ్వు పరిశుద్ధుడవు అవుతావు. ఏసు ఏమన్నాడు అంటే "మీరు నన్ను పరిశుద్ధుడు అని పిలవకండి. యెహోవా ఒక్కడే పరిశుద్ధుడు. పుట్టినవాడు ఎవడూ పరిశుద్ధుడుకాదు. ఎవడైతే పుట్టలేదో వాడు ఒక్కుడు మాత్రమే పరిశుద్ధుడు."

నాకొరకు కర్మ చెయ్యి అంటే దాని అర్థం దేవుడి దగ్గర కూర్చుని అస్తమాను మంత్రాలు చదవటంకాదు. అమ్మా నువ్వు చాలా మంచిదానవు అంటూ అమ్మకు అన్నం పెట్టకపోతే ఎలాగ? ఇప్పడు మనందరం చేసేది అలాగే ఉంది. విష్ణువు ఫొటో పెట్టుకోవటం, విష్ణు సహస్రనామాలు చదవటం, అందులో నీవు అంతటి వాడవు, ఇంతటి వాడవు అని ఆయనను పొగడటం అంతేగాని ఆయన చెప్పిన పని ఒక్కటీ చెయ్యటంలేదు. నాకొరకు కర్మ చెయ్యి అంటే భగవంతుడికి ఇష్టమైన పనులు చెయ్యాలి. మీరు యోగాభ్యాసాలు చెయ్యటంకాదు, మిమ్మల్ని గుంజీలు తీయమనటంలేదు. ఊరికే అలా కూర్చోండి, మీ మనస్సులోనికి రాగద్వేషాలు రాకుండా చూసుకోండి. అప్పడు సడన్‌గా మీ మనస్సు చల్లబడిపోతుంది. ఎప్పడైతే రాగద్వేషాలు తగ్గిపోయాయో అప్పడు మీ మనస్సుకు అంతర్దృష్టి కలుగుతుంది. ఎప్పడైతే మీకు అంతర్దృష్టి కలిగిందో ఈ రోజున కాకపోయినా, ముందునాటికైనా మీకు ఆత్మజ్ఞానం కలుగుతుంది.

భగవాన్ ఇంక కొంత టైములో శరీరం విడిచిపెడతారు అనగా భక్తులు లైనులో ఆయన దర్శనం చేసుకొంటున్నారు. భగవాన్ ఒక్కసారి కళ్ళు తెరచి అక్కడ ఉన్న సుబ్బరామయ్యగారి వంక చూసారు. మన వంకచూస్తున్నారు అని సుబ్బరామయ్యగారు గ్రహించి, నాకు అభయస్థితి కావాలి అని భగవాన్‌ను అడిగారు. ఆభయస్థితి అంటే మోక్షమే. ఒక్క మోక్షాన్ని పొందినవాడు మాత్రమే అభయస్థితిని పొందగలడు. మోక్షాన్ని పొందేవరకు, నిర్వాణస్థితిని పొందేవరకు భయం వెంటాడుతూనే ఉంటుంది. ఎంతకాలం అయితే భయం వెంటాడుతూ ఉంటుందో అంతకాలం దుఃఖం వచ్చి తీరుతుంది. అందుచేత నాకు అభయస్థితి కావాలి అన్నారు. మీరు వెంకటేశ్వరస్వామి దగ్గరకు వెళతారు. మాకు అది కావాలి, ఇది కావాలి అని అడుగుతారు. ఆ వ్యాపారం వద్దు అని పరమాత్మ చెపుతున్నాడు. మీరు అడగటం పొరపాటు అని కాదు. మీరు

నన్నే గమ్యంగా పెట్టుకోండి అని చెపుతున్నాడు. మీకు మంత్రి అవ్వాలని ఉంది అనుకోండి, మంత్రి పదవి కోసం భగవంతుడిని కోరుకొంటారు. అంటే ఆ గమ్యానికి వెళ్లటానికి భగవంతుడిని ఉపయోగించుకొంటున్నాము. అక్కడ మన గమ్యం భగవంతుడు కాదు. మనకు మార్గం భగవంతుడు. మన గమ్యం మంత్రి పదవే. ఇక్కడ పరమాత్మ ఏమంటున్నాడు అంటే నీ గమ్యంగా నన్నే పెట్టుకో. దేనినో పొందటానికి నన్ను ఉపయోగించుకొంటున్నారు కాని నన్ను పొందటానికి మీరు నన్ను ఉపయోగించుకోవటం లేదు. మీకు మార్గమును నేనే, గమ్యమూ నేనే. మీరు పొందవలసిన వాడిని నేనే. నన్ను తప్పించి మీరు ఏది పొందినా అది స్వప్న సమానము. నన్ను తప్పించి మీరు ఏది పొందినా అది అంతా దుమ్మే. స్వప్నం జరిగేటప్పడు అదంతా మనకు నిజం అనిపిస్తుంది. ఆ స్వప్నంలో నుండి బయటకు వచ్చాక ఇది అంతా అబద్ధం, ఇది స్టుపిడ్ స్టఫ్ అని అప్పడు మనకు తెలుస్తుంది. ఇప్పడు మనం నిజంకానిదానిని నిజం అనుకొంటున్నాము. చైతన్యంలోనికి మెలకువ వచ్చాక ఇప్పడు నిజం అనుకొనేది అంతా అబద్ధం అని, ఇదంతా స్వప్న సమానము అని అప్పడు మనకు తెలుస్తుంది.

భగవద్గీతలో రెండవ అధ్యాయం 16వ శ్లోకం మీరు అర్థం చేసుకుంటే 18 అధ్యాయలు అర్థం చేసుకొన్నట్లే. ఈ శ్లోకం నాకు చాలా ఇష్టం. ఈ శ్లోకం వెరీ క్లోజ్ టు మై హార్ట్. ఉన్నదేదో ఉంది, లేనిదేదో లేదు, ఉన్నదానికి లేకపోవటం అంటూ లేదు, లేనిదానికి ఉండటం లేదు. ఇది నిశ్చయం. ఇది మనకు అర్థమైతే 18 అధ్యాయాలు చదవనక్కరలేదు. కాని ఇది మనకు అర్థమవ్వటంలేదు. మన బ్రెయిన్‌కు అందటంలేదు. అందుచేత మనకోసం భగవంతుడు 18 అధ్యాయాలు ఖర్చుపెట్టాడు. మన శరీరాలు ఇవాళ భూమిమీద తిరుగుచున్నాయి, రేపు పోవచ్చు. మీ శరీరాలకు చావు ఉంది కాని నేను చెప్పే ఈ మాటలకు చావులేదు, ఇది అమృతం. నా శరీరం పోవచ్చుకాని ఈ వాక్యాలకు మరణం లేదు. వాక్యము దేవుడై ఉన్నది. ఈ వాక్యము భగవంతుడితో సమానము. భగవంతుడికీ, భగవంతుడు చెప్పిన మాటలకు బేధం లేదు. నేను చెప్పిన ఈ వాక్యాలను మీరు శ్రద్ధగా, భక్తిగా ఆచరిస్తే, అంకితభావంతో పనిచేస్తూ ఉంటే ప్రకృతిగుణాల నుండి విడుదల పొందుతారు, చావు పుట్టుకలు అనే సంసారచక్రం నుండి విముక్తులవుతారు. మీరు అందరూ నాకు ప్రియులుగా ఉండాలని అనుకొంటే, నా హృదయానికి క్లోజ్‌గా ఉండాలని అనుకొంటే నేను చెప్పిన ఈ మాటలను, ఈ అమృతాన్ని ఆచరించి మీరు తరించండి.

With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.

**- Mahabharatha**

# స్ఫూర్తి ప్రదాత

ఆధ్యాత్మిక మార్గంలో ఆధునిక మహర్షిగా పేరొందిన భగవాన్ శ్రీరమణమహర్షిచే ఎంపిక కాబడి, భక్తులచే ప్రియముగా నాన్నగారు అని పిలువబడే సద్గురువు శ్రీనాన్నగారు, జిజ్ఞాసువుల స్మృతిపథంలో శాశ్వతమైన ముద్రను వేసారు. శ్రీనాన్నగారికి భగవాన్ శ్రీరమణుని పట్ల ఉన్న శరణాగతి, గురుభావములో ఆయనకు ఆయనే సాటి. భగవాన్ శ్రీరమణుని జీవితము, బోధయొక్క అక్షరరూపము మరియు వాగ్రూపము కలిపితే అదే శ్రీనాన్నగారు. శ్రీనాన్నగారు శ్రీరమణహృదయాన్ని జ్ఞానప్రవచనాల ద్వారా సరళమైన రీతిలో బోధిస్తూ, భక్తులకు వచ్చే అనేక రకాల సందేహాలను తానే లేవదీసి, వాటికి సమాధానాలు చెబుతారు. అనేక సంవత్సరములుగా రమణబోధను మనకు సులభంగా అర్థం అయ్యేరీతిలో బోధించి, మనచే ఆచరింపచేయుటలో కృతకృత్యులగుచున్నారు. తత్త్వజ్ఞానాన్ని అందించి శ్రీరమణుని ఆదర్శాలకు అనుగుణంగా భక్తులను తీర్చిదిద్దుటలో రమణభాస్కర మాసపత్రిక ఉపయోగపడుతోంది. మానవుడు వాస్తవంగా తానెవరో? తెలుసుకోడానికి గురుబోధ, గుర్వనుగ్రహం తప్పనిసరి. శ్రీనాన్నగారు తమ జ్ఞానప్రవచనాలలో సత్సంగంయొక్క ప్రాముఖ్యతను, శ్రవణ, మనన, నిధిధ్యాసలయొక్క ఆవశ్యకతను నొక్కి చెబుతారు. అనేక సంవత్సరములుగా శ్రీనాన్నగారు మనకు అందిస్తున్న అమృతవాణిని నిత్యజీవితంలో అభ్యాసం చేసి, తద్వారా మనం దేహాత్మబుద్ధినుండి విడుదల పొందాలి. ఈ మానవశరీరం ప్రసాదింపబడినది కాబట్టి ఇప్పుడే, ఇక్కడే, ఈ శరీరం జీవించియుండగానే, స్వరూప అమృతస్థితిని పొందాలి. శ్రీనాన్నగారి బోధనుండి మనము ఏమి నేర్చుకున్నాము? మనస్సుకు ఎలాంటి శిక్షణనిస్తున్నామో, అవలోకించాలి. చిత్తశుద్ధితో నాన్నగారి బోధను ఆచరిస్తూ, వినయంతో గమ్యంవైపుకు సాగాలి. శ్రీనాన్నగారి కృపాపూర్ణమార్గదర్శకత్వం నిరంతరం ఉండాలని ఆయననే వేడుకుందాం.

ఓంతత్‌సత్

(దిII 23-09-2014 శ్రీనాన్నగారి జన్మదినం సందర్భంగా)

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం**

# కృష్ణస్తు భగవాన్ స్వయం - 2

గోపికలకు ప్రేమ - భగవంతుడు ఒక్కడే. వారు శ్రీకృష్ణుని ప్రేమమూర్తిగానే ఎన్నుకొన్నారు. శ్రీకృష్ణుడు "నన్ను గోపికలు బంధించినది ఈ ప్రేమబంధంలోనే" అన్నారు. రాధాకృష్ణుల ప్రేమలో కామభావన లేదు. రాధ కృష్ణునితో "నా హృదయంపై నీ చరణాలు నిలిపితివా కామమంతా మాయమైపోవును" అన్నది. గోపికల ప్రేమ అర్థం చేసుకోవటం చాలా కష్టము. ఆ గంభీరార్థము గ్రహింపని మూర్ఖులు మనముందు సైతము ఇప్పటికీ ఎప్పటికీ ఉంటూనే ఉంటారు. ఈ పవిత్ర గాఢప్రేమకు నీచార్థములు కల్పించి ఏవగించు మూర్ఖులు, కలుషిత మనస్కులు అపవిత్ర హృదయులు చాలామంది ఉన్నారు. ఆ గోపికాగానం, గానం చేసిన ఐతిహాసకుడు పరమపవిత్రుడై అవతరించిన నిత్య నిర్మల మూర్తి శ్రీ శుకమహర్షి "ఆ భక్తి యొక్క మహిమ మనకు తెలియదు. స్త్రీ, పురుష భేదాలు, ధనకీర్తి, కామం అనుక్షణం హృదయంలో పొంగిపొరలుచున్న క్షుద్ర మానవులు గోపికల విశుద్ధ ప్రేమను శ్రీకృష్ణ తత్త్వావతార రహస్యము అర్థం చేసుకొనలేక ఆక్షేపించుటకు పూనుకున్నారు. ఉత్తమ తత్వ శాస్త్రమైన 'గీత' సైతము ఆ భక్తి పారవశ్యకతకు సాటిరాదు" అన్నారు. గోపికలకు కృష్ణునిపట్ల భక్తి తప్ప మరేమియూ కనిపించదు. ఎటుచూచినా కృష్ణుడే ప్రతీ ముఖమునా కృష్ణవదనారవిందమే. తమ ముఖము సైతము శ్రీకృష్ణుడే అది మహత్తరమైన 'ఆర్తి'. దానితో వారు పుణ్యపాప బంధవిముక్తులైనారు అని శ్రీభాగవతం విశదం చేస్తుంది. మానవ మానసమునందు కామ-క్రోదాధి వికారాలు స్వయంగా తప్పలు అని గ్రహించే మూల రహస్యము జాగరూకతతో నిగ్రహించుచు, సక్రమ భక్తి మార్గంలో నిలచియుండుటయే మన కర్తవ్యము. సూరదాసు కృష్ణుని ఎప్పటికీ బాలునిగానే చూస్తాడు. రాసలీలలు గోపికలతో ప్రేమకలాపాలు సాగిస్తాడని, స్నానం చేసే స్త్రీల బట్టలు అపహరిస్తాడని కలలో కూడా ఊహించుకోడు. 'గోపి' అంటే ఇంద్రియములు అని అర్థం. ఇంద్రియాలను ఆవరణ రహితం చేస్తాడని అర్థం. స్త్రీలను ఆవరణ రహితం చేయుటకాదు. నారదభక్తి సూత్రాలు "భగవంతుని యెడల చూపబడు ప్రగాఢమైన ప్రేమే భక్తి అది అనురాగామృతం అట్టి అనుభూతి గోపికలకు ఉంది. కృష్ణుడిని భగవంతుడిగా ఎప్పడూ మరువలేదు మర్చిపోతే వ్యభిచారులై పాపులయ్యేవారు" అంది. కృష్ణుడు రణరంగంలో నిశ్చల ప్రశాంత చిత్తుడై ధర్మోపదేశం చేసాడు. కర్మయందు అకర్మ, అకర్మయందు కర్మను చూచునో ఆతడే యోగి. కృష్ణుని అధరం మధురం, వదనం మధురం, నయనం మధురం, హృదయం మధురం. మధురాతి పతే రఖిలం మధురమ్.

- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం